ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూ., కిలోల్లో.. టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 47, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, **మునగకాయ** 3–4, ముల్లంగి 3–5. ఈ ధర**లు సోమవారం** ఉదయం 9 గంటల వర**కు మాత్రమే** అమలులో ఉంటాయి.

అమన్ వేదికకు రిఫ్రిజిరేటర్ వితరణ



విద్యార్థులకు రిఫ్రిజిరేటర్ అందించిన మాజీమేయర్ బండ కార్తీకారెడ్డి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి అమన్‌వేదిక బాలికల ఆశ్రమంలో ఆదివారం గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆమె అక్కడ బాలిక హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సౌకర్యార్థం డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్‌ను అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, వీరన్న, కనకట్ల హరి, నరహరి, మహేశ్ యాదవ్, సంపత్, భాస్కర్ గిరి, ప్రభు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

18న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలం

సనత్‌నగర్: వివిధ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాల వేలం ఈ నెల 18న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహనరెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి సమక్షంలో ఈ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా తమ ఆధార్‌కార్డు కాపీ, పాన్‌కార్డు కాపీతో పాటు రూ.25,000 నగదు లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ముందుగా జమ చేసి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలో వాహనం పొందని వారికి ఇది తిరిగి ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 87126 59644 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించాలి



వినతిపత్రం అందిస్తున్న సైదులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ వర్గీకరణను పునఃసమీక్షించాలని ఏబీసీ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ గౌతమ్‌కు, మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షుడు సైదులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తప్పుడు తడకగా జరిగిందని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారాజ్యాంగా వ్యవహరించారని తెలిపారు. తప్పుడు రోస్టర్ విధానంతో మాలలు, మాల ఉపకులాలకు నష్టం జరిగేలా వర్గీకరణ చేపట్టారని, వెంటనే పునఃసమీక్ష చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత గడ్డం శ్రీనివాస్, కార్తీక్, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్యారసాని కుటుంబానికి తలసాని పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

బొల్లారం: కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీ శంకర్, ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. గౌరీశంకర్ సతీమణి కమలా దేవీ ఇటీవల మరణించారు. వారి కుమారుడు శ్యామ్‌కుమార్, కోడలు భాగ్యశ్రీ కూడా బోర్డు మాజీ సభ్యులు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్యారసాని ఇంట విషాదం నేపథ్యంలో తలసాని శ్రీనివాస్ లాల్‌బజార్‌లోని వారింటి వెళ్లి పరామర్శించారు. ప్యారసాని కమలాదేవి మృతిపై తనతో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోందన్నారు. తలసాని వెంట బీఆర్ఎస్ నేతలు టీఎన్ శ్రీనివాస్, యశ్వంత్ కుమార్ తదితరులున్నారు.



అంతర్గత రోడ్లు

ఇబ్బందుల్లో వాహనదారులు, పాదచారులు

ప్యాచ్ వర్క్, నూతన రోడ్లు వేయాలని వినతి



న్యూ అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో నిత్యం ఆ మార్గాన రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై నడవలేక అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. న్యూ అశోక్ నగర్ కమ్యూనిటీహాల్ రోడ్డు, రామాలయం ఆలయ తదితర ప్రాంతాల్లో అధ్వానంగా రోడ్లు దర్శనమిస్తున్నాయి.

రోడ్లన్నీ గుంతలమయం

డివిజన్ పరిధిలో అధిక ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అస్తవ్యస్తంగా, అధ్వానంగా ఉన్నాయని బస్తీవాసులు ఆగ్రహం చెందుతున్నారు. అంతే కాకుండా వర్షాలు కురుస్తున్న సమయంలో ఆ గుంతల్లో నీళ్లు చేరుతున్నాయని, దీంతో గుంతలు కనబడక వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారన్నారు. స్థానికంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కూడా నిండిపోయిన సమయాల్లో మురుగునీరు కూడా చేరి దుర్వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు.



న్యూ అశోక్‌నగర్‌లో రోడ్డు

పట్టించుకోని అధికారులు

స్థానికంగా నెలకొని ఉన్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన దృష్టి సారించని కారణంగా అవి పేరుకుపోతున్నాయి. తద్వారా నిత్యం పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా కూడా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా, అధ్వానంగా ఉన్న రోడ్లను తగిన **మరమ్మతులు** చేయాలని, నూతన రోడ్లు **ఏర్పాటు చేయా**లని కోరుతున్నారు.

– బస్తీవాసులు

19న జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మహాసభ నాయకులు

బస్సీలాల్‌పేట్: ముదిరాజ్ మహాసభ అఖిల భారత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ జన్మదినాన్ని ఈ నెల 19న ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ నాయకులు వెల్లడించారు. ఆదివారం బోయిగూడ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభ నాయకులు మాట్లాడారు. ముదిరాజ్ భవన్‌లో 19 ఉదయం 11గంటలకు జరిగే కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, మహిళలకు చీరలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కాసాని జన్మదిన వేడుకలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముదిరాజ్ కులస్తులు హాజరవుతున్నట్లు వివరించారు. సమావేశంలో మహాసభ నాయకులు తోట్ల సురేందర్, తలారి శ్రీకాంత్, గొడుగు ఆంజనేయులు, దేవుడు శ్రీనివాస్, మన్మోహన్, రాజేంద్రప్రసాద్, రాజారామ్, పట్నం విజయ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అధ్వానంగా రోడ్లు



లాలాపేట: కొన్ని రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తార్నాక డివిజన్‌లోని రోడ్లు అధ్వానంగా మారాయి. తార్నాక చౌరస్తాలోని ప్రధాన రహదారిలో దాదాపు అడుగులోతు మేర గుంత ఏర్పడింది. దీంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. తార్నాక మెట్రో స్టేషన్ కింద రోడ్డు ఇరువైపులా రహదారంతా పూర్తిగా గుంతల మయమైంది. ఈ మార్గం గుండా వెళ్తున్న వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కల్గుతుంది.

- తార్నాక కాలనీ అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలైన లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్, లక్ష్మీనగర్, చంద్రబాబునగర్, శ్రీపురి కాలనీ రోడ్లన్ని పాడైయాయి. మ్యాన్‌హోళ్ల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. స్థానికులకు రాకపోలకు, పాదచారులకు కష్టతరంగా మారింది.
- లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియంలో భారీగా వర్షం నీరు చేరింది. గ్రౌండంతా బురదమయంగా మారింది. కొన్ని రోజుల నుంచి ఉదయం సాయంత్రం ఇక్కడికి వచ్చే మార్నింగ్ వాకర్స్‌కు, క్రీడలకు ఆంతరాయం కల్గుతుంది. మరోవైపు స్టేడియం గోడలు పగుళ్లు భారీ వర్షానికి ఉరుస్తున్నాయన్నారు. స్టేడియం నిర్వాహణను పూర్తిగా గాలికి వదిలేశారని వాకర్స్ జీఎం రమేశ్, కిరణ్‌గౌడ్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



తార్నాక చౌరస్తాలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

రక్తదానం చాలా గొప్పది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

లాలాపేట: రక్తదానం అనేది చాలా గొప్ప పని అని ఆపదలో ఉన్నవారి ప్రాణాలు రక్షించడంలో రక్తదాతలు నిజమైన ప్రాణదాతలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన సందర్భంగా ఆయన అభిమానులు తార్నాకలోని ప్రెసిడెంట్ ఫంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన దీన్లో దాదాపు 51 మందికి పైగా యువత ఈ శిబిరం ద్వారా రక్తాన్ని దానం చేశారు. దీనికి రామ్ చందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన పలువురిని అభినందిస్తూ సర్టిఫికెట్, మెమొంటోలను అందజేశారు. ఈ శిబిరాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, మహిళా నాయకురాలు స్టాలీన్ కృష్ణవేణి, బీఆర్ఎస్ యువ నాయకులు రామేశ్వర్‌గౌడ్, స్థానిక నాయకులు రాజేందర్ యాదవ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు సందర్శించి రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లాలాపేట, తార్నాక చిరంజీవి, పవన్ కల్యాణ్ యూత్ అసోసియేషన్ నాయకులు పి.వేణుగోపాల్‌రెడ్డి, పరశురామ్, కిరణ్‌కుమార్ గౌడ్, కృష్ణ, శివశంకర్, కైసర్, మనోహర్, ప్రసాద్, రషీద్, భిక్షపతి, గౌస్ తదితరులు ఉన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత



రక్తదాతలను అభినందిస్తున్న రాంచందర్‌రావు

ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మర్రి అభినందనలు



ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనతనగర్: ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణను ప్రకటించడంపై ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆదివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న బహుజన రాజ్యస్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్ తెలిపారు. చిక్కడపల్లిలోని కల్లు కంపౌండ్‌లో జరిగే జయంతి వేడుకలకు బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జాక్ కన్వీనర్ విశారదన్ మహారాజ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. పెద్ద ఎత్తున గౌడ కులస్తులు తరలి వచ్చి ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

అన్నదానం

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ పోచమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్‌ముదిరాజ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజేశ్వరిగౌడ్, సభ్యులు, అడ్వైజర్స్ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు సభ్యురాలు భానుక నర్మద

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్
- బోర్డు సభ్యురాలితో కలసి పనులు ప్రారంభం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధియే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. రూ.39 లక్షల నిధులతో కంటోన్మెంట్ ఆరో వార్డు రాయల్ ఎన్‌క్లేవ్ – ఆరావళి కాలనీల్లో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనుల విషయంలో బోర్డు సభ్యురాలితో కలసి ముందుకు సాగుతామన్నారు. ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన పరిహారం సొమ్ము రూ.303 కోట్లతో కంటోన్మెంట్‌లో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరగనుందన్నారు. ఈ నిధులతో పికెట్, హస్మత్‌పేట నాలాలతో పాటు, కంటోన్మెంట్ వ్యాప్తంగా డ్రైనేజీ లైన్‌లను పూర్తిస్థాయిలో ఆధునీకరిస్తామన్నారు. ఆరావళి, రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీలు హస్మత్‌పేట నాలా ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈటల కృషివల్లే నిధులు: భానుక

ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవతో కంటోన్మెంట్‌కు రూ.303 కోట్ల పరిహారం సొమ్ము దక్కుతోందని బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. కంటోన్మెంట్ నిధులతో పాటు ఎమ్మెల్యే శ్రీగణేశ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు అందితే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, బాణాల శ్రీనివాస్ రెడ్డి, ముప్పిడి మధుకర్, బీజేపీ వార్డ్ అధ్యక్షులు ప్రతీక్ జైన్, అజయ్‌గౌడ్, స్వరూప, భారతితో పాటు కాలనీవాసులు చంద్రప్రకాష్, జయగౌడ్, ప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, సురేష్, జ్ఞానేశ్వర్, రవి, సెల్వరాజ్, శ్రీరామ్, కన్నాబి రామ్, హర్ష, శివ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా సురేశ్



సురేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ

కంటోన్మెంట్: మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా బోయిన్‌పల్లి మహాత్మానగర్‌కు చెందిన సంఘం సురేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ నియామకపత్రం అందజేశారు. ఆదివారం బోయిన్‌పల్లికి వచ్చిన శ్రీకృష్ణ స్థానిక మాల మహానాడు నేతలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో దళితులపై దాడులు ఎక్కువ అవుతూ ఉండటం ఆందోళనకరం అన్నారు. దళితులు సంఘటితంగా హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ రావు స్ఫూర్తిగా ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని సురేశ్ అన్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన మాల మహానాడు పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

మొక్కలు నాటిన కాలనీవాసులు



మొక్క నాటుతున్న జెక్‌కాలనీవాసులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ యూబీడీ సహకారంతో కాలనీలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పలు అపార్టుమెంట్ల ఎదుట పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించుకోవడం ద్వారా కాలుష్యానికి దూరంగా ఉండవచ్చన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడం మనందరి బాధ్యత అని, అది మొక్కలు నాటి వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు గ్రీన్ సిటీ సుబ్బరాజు, రాజశేఖర్‌చందు, సోమ వెంకట్, బిల్డర్ రాజా, రామసుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కంకపాద' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత్రి కల్యాణి కుంజ రచించిన ఆదివాసీ కవిత సంపుటి 'కంకపాద'పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మట్టి, అడవి నుంచి వచ్చి అడవి కావాలని పోరాటం చేస్తున్న కళ్యాణి కుంజకు అభినందనలని అన్నారు. కవి యాకుబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఏకే ప్రభాకర్, డాక్టర్ పసునూరి రవీందర్, అనసూయ, నాగిల్ల రమేష్, డాక్టర్ తండా హరీష్ గౌడ్, కుంజ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం కదిలించేదిగా ఉండాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవిత్వం ఇతరులను కదిలించేది ఉండాలని ప్రముఖ కవి, విమర్శకులు నిఖిలేశ్వర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ఆశయ (పదం నవల) అభద్రం(కథలు), సజీవం (కవిత్వం), ప్రజాగానం, సామాజిక ఉద్యమ గీతాలు, మీరే ప్రేరణ, మీరే సాధన (వ్యక్తిత్వ వికాసం), నేనిప్పుడు కమ్యూనిజానికి సొంతం (ఆరుద్ర) పుస్తకాలను ఆవిష్కరించారు.

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిఖిలేశ్వర్ మాట్లాడుతూ... ఒకే వేదికపైన 6 పుస్తకాలను ఆవిష్కరించడం అరుదైన విషయమని అన్నారు. ఇది ఆయన ప్రతిభకు తార్కాణమని అన్నారు. అక్షరాల్లో జీవించిన వ్యక్తిగా ఇలాంటి పుస్తకాలు రాయడం గొప్ప పరిణామమని అన్నారు. కవితాక్షరాలు ఎనాటికైనా సజీవంగా ఉంటాయని అన్నారు. తన వ్యక్తిగత అనుభవాల నుంచి పుస్తకాలను రాయడం వల్ల పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. కలకాలం ఉండేది కవిత్వమని ఆ దిశగా కవిత్వం సాగాలని చెప్పారు.
- తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పసునూరి రవీందర్, తెలంగాణ సాహితీ అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి, నవతెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేష్, ప్రముఖ కవి యాకుబ్, సినిమా విమర్శకులు రెంటాల జయదేవ్, డాక్టర్ సలీమ, మోహన కృష్ణా,శరత్, సుదర్శి పాల్గొన్నారు.

శాంతియుతంగా చవితి ఉత్సవాలు జరుపుకుందాం

బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి



మాట్లాడుతున్న బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

సనత్‌నగర్: శాంతియుతంగా చవితి ఉత్సవాలు జరుపుకుందామని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి అన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాదాపు 250 మంది వినాయక మండప నిర్వాహకులతో ఆదివారం స్థానిక ఫంక్షన్ విల్లాలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు పోలీసులు నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా సహకరించాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా పోలీసు విభాగం తరుపున అక్కడ నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించిన సమయం నుంచి నిమజ్జనం పూర్తయ్యేవరకు నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలన్నారు. మండపాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేందుకు సులువవుతుందన్నారు. మండపాల వద్ద సేవా దృక్పథం ఉన్న వలంటీర్లను నియమించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు, భక్తులకు, సామాన్య ప్రజలకు అంతరాయం చూసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని తెలిపారు. డీజే సిస్టంల కారణంగా వృద్ధులకు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున గణేశ్ ఉత్సవ సమితి వారు సహకరించాలన్నారు. లౌడ్‌స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. మండపాల వద్ద గానీ, ఊరేగింపులో గానీ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నవీన్, డీఐ శ్రీనివాస్, ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, గౌతమి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణలో భాగస్వాములవుదాం..

'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ' నెలకొల్పడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏసీపీ గోపాలకృష్ణమూర్తి కోరారు. డ్రగ్స్ కారణంగా ఎన్నో జీవితాలు అంధకారంలోకి నెట్టబడుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించాలంటే తల్లిదండ్రులు పాత్ర కీలకమన్నారు. పోలీసు తనిఖీల్లో డ్రగ్స్ వాడినట్లు, లేదా క్రయవిక్రయాలు జరిపినట్లుగా తేలినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.